## క్లుప్తంగా

### సింగరాయకొండ ఎస్సైగా టి.శ్రీరామ్

సింగరాయకొండ: మండల నూతన ఎస్సైగా టి.శ్రీరామ్ నియమితులయ్యారు. డిస్ట్రిక్ట్ వీఆర్‌లో ఉన్న ఆయనకు సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ కేటాయిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహ్మద్ ఫిరోజ్‌ఫాతిమా ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

### జూలై 1 నుంచి జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంప్‌లు

సింగరాయకొండ: మండలంలో జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ షేక్ జమీ ఉల్లా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన మ్యారేజ్, డెత్, బర్త్, ఇన్‌కం సర్టిఫికెట్లతోపాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. జూలై 1వ తేదీన ఊళ్లపాలెం, పాకల-1, జూలై 3న సింగరాయకొండ-3, మూలగుంటపాడు-1, 5వ తేదీన సింగరాయకొండ-2, కనుమళ్ల, 7వ తేదీన సోమరాజుపల్లి, పాత సింగరాయకొండ, 10వ తేదీన సింగరాయకొండ-1, కలికవాయ, 12వ తేదీన శానంపూడి, బింగినపల్లి, 14వ తేదీన సింగరాయకొండ-4, పాకల-2, 17వ తేదీన మూలగుంటపాడు-2 సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

### 997 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం జమ్ములపాలెం, తుమాడు గ్రామాల రైతులు 1032 బేళ్లు తీసుకురాగా 997 కొనుగోలయ్యాయి. 35 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.246, కనిష్ఠ ధర రూ.163, సరాసరి ధర రూ.240.94 పలికింది. వేలంలో మొత్తం 33 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

### నవోదయకు ఎంపికైన కొణిజేడు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామంలో శ్రీశ్రీనివాస యూపీ స్కూల్ విద్యార్థులు నలుగురు నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశం పొందారని ఎంఈఓ చెంచుపున్నయ్య తెలిపారు. విద్యార్థులు పచ్చబొట్ల మారురి శ్రీ చరణ్, తన్నీరు సాయి హర్ష, గంటెనపల్లి మనస్వి, జక్కుల అశ్వితను శుక్రవారం ఎంఈఓతోపాటు బాలాజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చిట్టిబాబు, చంద్రశేఖర్, పాఠశాల కరస్పాండెంట్ కొల్లి శ్రీనివాసులు, నిర్మల్ ఏసుపాదం, తల్లితండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

### మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మర్రిపూడి: రెండు రోజులుగా తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.అంకమ్మరావు తెలిపారు. వివరాలు.. మండలంలోని చిమట గ్రామానికి చెందిన వెలుతర్ల ప్రసాద్‌కు ధర్మవరం గ్రామానికి చెందిన నారపరెడ్డి పద్మ కుమార్తెతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భార్యాభర్తల మధ్య కలహాలు ఏర్పడటంతో ఇద్దరు పిల్లలు ప్రసాద్ వద్దే ఉంటున్నారు. ప్రసాద్ భార్య ఇటీవల ధర్మవరంలో పుట్టింటికి వెళ్లింది. గురువారం ఆడబిడ్డ ఊరు అయిన దర్శి వెళ్లి వస్తానని చెప్పిన తన కూతురు ఆచూకీ లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.అంకమ్మరావు తెలిపారు.

### ఓటరు క్లైమ్‌లపై ప్రత్యేక దృష్టి

వెలిగండ్ల: ఓటరు క్లైమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డీఓ అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు, వీఆర్‌ఓలకు ఓటరు క్లైమ్‌లపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఓటరు క్లైమ్‌లపై చేర్పులు, మార్పులు సరిచూడాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారి దరఖాస్తులో అన్ని పత్రాలు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి, సౌకర్యాలు లేని చోట సౌకర్యాలు కల్పించాలన్నారు. తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

**ఓటర్ల జాబితాలో పారదర్శకత పాటించాలి**

కనిగిరి రూరల్: సమ్మరి రివిజన్ ఓటర్ల జాబితా తయారీలో బీఎల్వోలు పారదర్శకత పాటించాలని ఆర్డీఓ టి. అజయ్ కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమ్మరీ రివిజన్, 2024 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ యు. పుల్లారావు, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పాల్గొన్నారు.


వెలిగండ్లలో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ అజయ్‌కుమార్

# గ్రామ స్వరాజ్యంతో కొత్త జోష్


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ (ఫైల్)


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ (ఫైల్)

- సచివాలయాలతో సమస్యలకు చెక్
- నియోజకవర్గంలో 105 సచివాలయాలు
- 974 మంది సచివాలయ ఉద్యోగులు
- 1,466 మంది వలంటీర్లు
- మున్సిపాలిటీ, ఆరు మండలాల్లో పింఛన్ లబ్ధిదారులు 37,288 మంది

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టక ముందు ఆలనాపాలనా కరువైన గ్రామాలు నేడు సగర్వంతో తలెత్తుకు నుంచున్నాయి. గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చిన్న పనికి కూడా వారాలు, నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే దుస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రతి చోటా నూతన ఉత్తేజంతో ఉద్యోగులు పని చేస్తున్నారు.

**సేవలు ఇలా..**

| పట్టణం/ మండలం పేరు | మున్సిపాలిటీ/ గ్రామ పంచాయతీ | సచివాలయాలు | సచివాయల ఉద్యోగులు | వలంటీర్లు (ప్రస్తుతం పనిచేస్తున్న వారు) | పంపిణీ చేస్తున్న పింఛన్లు నెల వారిగా ( ప్రస్తుతం వరకు) |
|---|---|---|---|---|---|
| కనిగిరి మున్సిపాలిటీ | 20 వార్డులు | 12 | 120 | 221 | 4,120 |
| కనిగిరి రూరల్( మండలం) | 25 | 20 | 195 | 235 | 6,557 |
| పామూరు | 25 | 19 | 158 | 327 | 7,900 |
| సీఎస్‌పురం | 23 | 15 | 122 | 201 | 5,328 |
| హెచ్‌ఎంపాడు | 23 | 14 | 124 | 140 | 4,065 |
| వెలిగండ్ల | 21 | 12 | 139 | 169 | 4,588 |
| పీసీపల్లి | 18 | 13 | 116 | 173 | 4,670 |

**కోట్లాది రూపాయలు..**

పింఛన్ నగదును ప్రతి నెలా 4,120 మందికి రూ. 1,16,42,500, జగనన్న చేయూత ద్వారా మూడేళ్లలో 5,544 మందికి రూ. 10.08 కోట్లు అందించారు. కనిగిరి రూరల్ గ్రామాల్లోని 25 పంచాయతీల్లో వైఎస్సార్ చేయూత మొత్తం మూడేళ్లకు గాను 2047 మందికి, రూ. 3,54,83750 కోట్లు అందించినట్లు అధికారులు తెలిపారు. 2020–21 ఏడాదిలో 1865 మందికి రూ. 3,24,69000 కోట్లు, 2021–22 ఏడాదికి 1914 మందికి రూ. 3,34,24359 కోట్లు, 2022–23 ఏడాదికి 2047 మందికి రూ. 3,54,83750 కోట్లు అందిస్తున్నారు.

**సచివాలయ వ్యవస్థ ఆదర్శం**



గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం. ప్రజలకు అవసరమైన సేవలన్నీ వీటి ద్వారానే వారి గ్రామాల్లో లభిస్తున్నాయి. ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.

– దంతులూరి ప్రకాశం (ఎంపీపీ )

**మెరుగైన సేవలు**



గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నాం. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నాం.

– ఎస్‌కే ఖాజాబీ (వలంటీర్, వంగపాడు సచివాలయం)

**ప్రజల నుంచి మంచి ఆదరణ**



సచివాలయ వ్యవస్థకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. సచివాలయ ఉద్యోగులకు అనుబంధంగా వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్నారు.

– డీవీఎస్ నారాయణరావు (కమిషనర్, కనిగిరి మున్సిపాలిటీ)

**ప్రజలకు మేలు**



సచివాలయాల్లోనే అన్ని ప్రభుత్వ పథకాలు, పింఛన్, రేషన్ కార్డు వగైరా సేవలు అందిస్తున్నారు. అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.

– కె. మోహన్‌రావు ( బల్లిపల్లి)

## జగనన్న సురక్షను పారదర్శకంగా నిర్వహించాలి


పొన్నలూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి సచివాలయం పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనుందన్నారు. దీని ద్వారా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి కులం, ఆదాయం, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు మంజూరు చేస్తుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కోసం రెవెన్యూ సదస్సు


మాట్లాడుతున్న తహసీల్దార్ సుందరమ్మ

వలేటివారిపాలెం: అయ్యవారిపల్లిలో రైతుల సమస్యలపై రెవెన్యూ సదస్సు శుక్రవారం తహసీల్దార్ కె. సుందరమ్మ ఏర్పాటు చేశారు. జగనన్న సురక్ష పథకం ద్వారా వివిధ రకాల సేవలు పొందవచ్చని చెప్పారు. సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ నరసయ్య, సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు.

# అర్హత ఉంటే సంక్షేమం అందాలి


జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


పామూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ, మండల ప్రత్యేకాధికారి


గుడ్లూరులో జగనన్న సురక్ష కార్యక్రమంవీక్షిస్తున్న అధికారులు


వెలిగండ్ల: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ సుకుమార్, పంచాయతీ కార్యదర్శులు

– అదే జగనన్న సురక్ష ఉద్దేశం

కనిగిరి రూరల్: అర్హత ఉంటే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందించాలన్న ఉన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమ దృశ్యాన్ని స్థానిక మున్సిపల్ ఆఫీసులోని విడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీక్షించారు. అనంతరం చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని సచివాయల పరిధిలో అధికారులు బాధ్యతాయుతంగా చేపట్టాలని ఆదేశించారు. శనివారం నుంచి గృహ సందర్శన కార్యక్రమం జరగాలని, జూలై 1 నుంచి మండల స్థాయి అధికారులు రెండు టీంలుగా ఏర్పడి ప్రతి సచివాలయంలో క్యాంపులు నిర్వహించి పథకాల సమస్యలను పరిష్కరించడంతో పాటు, సర్వీసు ఫీజు లేకుండా అవసరమైన సర్టిఫికెట్లను అందించాలని తెలిపారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ గాలిబోయిన ధనుంజయ్, కౌన్సిలర్లు దేవరాజ్, వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, దాసరి మురళీ, అబ్రహం లింకన్, పులి శ్రీను, ఎస్‌కే ఖాజా, అడ్మిన్ శైలజ, నాగమల్లేశ్వరి, జ్యోతి, ఖాజావలి, ఏఈ కోటేశ్వరరావు, నాయకులు భారతి, నాగూర్‌బీ పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష విజయవంతం చేయండి**

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించడాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఎంపీపీ పులిరమేష్, జెడ్పీటీసీ రామిరెడ్డి, తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, ఎంపీడీఓ చంద్రసేన్, ఏపీఓ వినయ్, ఏఓ రవికుమార్, డీటీ రమేష్ పాల్గొన్నారు.

పామూరు: ప్రజాసమస్యల పరిష్కారం, వివిధ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తు, మంజూరు కోసం ప్రభుత్వం ప్రారంభిస్తున్న జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి, మండల ప్రత్యేకాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభ ప్రసారాన్ని వీక్షించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీలు రషీద్, యేసురత్నం పాల్గొన్నారు.

వెలిగండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి. సుకుమార్, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లుతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు వీడియో కాన్ఫరెన్సుకు హాజరయ్యారు. జగనన్న సురక్ష పథకం విధి విధాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచనలు ఇచ్చారు. జూలై 1 నుంచి జగనన్న జగనన్న సురక్ష పథకం పగడ్బందీగా నిర్వహించాలని.. వారం రోజుల ముందు వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి 9 రకాల పత్రాలపై సమస్యలు ఉంటే సేకరించాలన్నారు.

కందుకూరు: మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమ తేదీలను మున్సిపల్ కమిషనర్ మనోహర్ శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మూడు చక్రాల మోటారు వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, బుర్రా

కనిగిరి రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో శుక్రవారం జిల్లా విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో 10 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు (రూ. 12 లక్షల విలువ చేసే వాటిని)ను ఎమ్మెల్యే బుర్రా చేతుల మీదుగా పంపిణీ చేశారు. జిల్లా మేనేజర్ జి. అర్చన మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, రామన తిరుపతిరెడ్డి, గాయం బలరాంరెడ్డి, అత్యాల జఫన్య, చెరుకూరి సతీష్ చౌదరి, జి. బొర్రారెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలాని, కౌన్సిలర్లు తిరుపతయ్య, శ్రీరాం సతీష్, మీరావలి, ఖాజా,అబ్రహం లింకన్, జానీ పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోండి


పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్స్ ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన వారికి కోర్స్ కంప్లీషన్ సర్టిఫికెట్లు, ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ అధికారి ఆర్. లోకనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ, ఆత్మ స్థైర్యంతో ముందుకు నడిచినప్పుడే భవిష్యత్తుకు మంచి మార్గం లభిస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ప్రిన్సిపాల్ ఉషారాణి, సిల్క్ హబ్ కోఆర్డినేటర్ బీగాల శ్రీనివాస్, బెనర్జీ, శ్రీనివాసచారి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, వైస్ చైర్మన్ ఆర్. మాణిక్యరావు, వైస్ ఎంపీపీ గాలిబోయిన ధనుంజయ్, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, శ్రీ రాం సతీష్, వేల్పుల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, మీరావలి, భారతీ, నాగూర్‌బీ పాల్గొన్నారు.

**మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**
**O.S.No: 46/2022**

మల్లెబోయిన నారాయణమ్మ.. వాది
వర్సెస్
పెండెల రఘురామయ్య మరియు వగైరాలు
... ప్రతివాదులు

**నోటీసు**

టు, D1; పెండెల రఘురామయ్య, S/o.వెంకటేశ్వర్లు, D4; చక్కా రాజేశ్వరి, W/o. మల్లిఖార్జున రావు

ప్రతివాదులు 1 మరియు 4ల చిరునామా జవహర్‌లాల్ వీధి, కనిగిరి టౌన్ మరియు నగర పంచాయితీ, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను దావా పరిహారం కోరి వాది మీ మీద సదరు దావాను దాఖలు చేసియున్నందున సదరు దావాను సదరు కోర్టు వారు తే.30.06.2023దికి వాయిదా వేయబడియున్నది. కావున ఆ తేదీన ఉదయం 10:30ని॥లకు మీరు స్వయంగా కాని లేదా లాయరు ద్వారా కాని హాజరై మీకేమైన దావా పరిహారములు మంజూరు విషయంలో అభ్యంతరములు ఉన్న యెడల సదరు కోర్టు వారికి తెలియజేయవలయునని అట్లు కాని యెడల సదరు దావాను మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు: శ్రీ టి.గోపాల కృష్ణమూర్తి, వాది తరపు అడ్వకేట్
వాయిదా: 30.06.2023

## జగనన్న ఆణిముత్యాలకు అభినందలు


బహుమతులు ప్రదానం చేస్తున్నా ఎంఈఓ

హనుమంతునిపాడు: గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, మూడో స్థానాల్లో నిలిచిన జగనన్న ఆణిముత్యాలకు రెండో ఎంఈఓ ఎస్.రమణయ్య నగదు, ప్రశంస పత్రాలను అందజేసి అభినందలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 541 మార్కు సాధించిన గోనా కావ్యకు రూ. 3 వేలు, 531 సాధించిన పచ్చా బ్రహ్మయ్యకు రూ. 2 వేలు, 527 సాధించిన గోనా స్వప్నకు రూ. 1000 అందించారు. హెచ్‌ఎం జీవిసురేష్ బాబు, బి.సుబ్బారావు, బ్రహ్మయ్య, నాగయ్య, రామయ్య, వెంకటయ్య, భాగ్యరేఖ, రోహినా, గౌషబాష, ఎలిక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అన్ని వార్డుల్లో అభివృద్ధి

కనిగిరి రూరల్: దశలవారీగా పట్టణంలోని అన్నివార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలించారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, ఏఈ కోటేశ్వరరావు, విద్యుత్ ఏఈ పవన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య పాల్గొన్నారు.

### పచ్చి రొట్ట విత్తనాలు సిద్ధం

హనుమంతునిపాడు: రైతన్నలకు పచ్చి రొట్టె విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ గోపిక్రిష్ణ గురువారం ఒక ప్రకటల్లో తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం జెరాక్స్ కాపీలతో రావాలన్నారు.


చోరీ కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన జరుగుమల్లి, సింగరాయకొండ, టంగుటూరు ఎస్సైలు వెంకటేశ్వరరావు, ఫిరోజ్‌ఫాతిమా, ఖాదర్‌బాషాకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎస్పీ మలికాగర్గ్

### హెచ్‌ఎం పాడు ఎస్సైగా శివ నాగరాజు

హనుమంతునిపాడు: స్థానిక ఎస్సైగా పులి శివ నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న జి. క్రిష్ణపావని ఒంగోలు వీఆర్‌కు వెళ్లారు. ఆమె స్థానంలో ఒంగోలు ఎస్సైగా పని చేస్తున్న పులి శివ నాగరాజు హెచ్‌ఎంపాడు విధుల్లో చేరారు.

### పీసీపల్లి తహసీల్దార్‌గా ప్రవీణ్

పీసీపల్లి: నూతన తహసీల్దార్‌గా ప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రసాద్ కొనకనమిట్లకు బదిలీ అయ్యారు. మండలంలో భూ వివాదాలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

### ఓటర్ల జాబితా సరి చేయాలి

హనుమంతునిపాడు: పంచాయతీలోని ఓటర్ల జాబితాలో సవర్ణలు చేయాలని ఆర్డీఓ కె .అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాలో తప్పులున్న, పేర్లు, తప్పులున్న, ఫొటోలు తేడా ఉన్న, సవర్ణలు చేయాలన్నారు. తహసీల్దార్ ఎస్.హరిబాబు, డీటీ కిషోర్‌రెడ్డి, వీఆర్వోలున్నారు.

### ఉత్తమ విద్యకు తొలి ప్రాధాన్యత

పామూరు: విద్యారంగంలో మండలాన్ని ప్రథమస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని రెండో విద్యాశాఖాధికారి జి.కరుణకుమారి అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం పామూరు రెండో ఎంఈవో ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి.కరుణకుమారిని ఏపీ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సంఘ మండల అధ్యక్షుడు వై.రామచంద్రారెడ్డి, కార్యదర్శి నాగయ్య, బి.వెంగళరెడ్డి, జి.సుధాకర్, హరనాథరెడ్డి, సుజాత, నీరజ పాల్గొన్నారు.


ఎంఈవో కరుణ కుమారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు